ఉపాధ్యాయులకు ఊరట 7

సర్దుబాటు గడువు జూలై 15వరకు పెంపు

పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు

హర్షం వ్యక్తం చేస్తున్న టీచర్లు









ఏరువాక సాగారో..

ముందస్తుగా వర్షాలు కురవడంతో రైతులు వానాకాలం సాగుకు సమాయత్తం అవుతున్నారు. ఎక్కువ మంది రైతులు ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేస్తున్నప్పటికీ కొందరు పాతకాలపు పనుముట్లను వినియోగిస్తూ సాగు చేపడుతున్నారు. సీజన్ ప్రారంభం కావడంతో వ్యవసాయ పనుల్లో ప్రధానంగా ఉపయోగించే నాగలి, గుంటుక, పత్తి అడ్డ తదితర పనుముట్లను వడ్రంగి దగ్గర తయారు చేయించడంలో అన్నదాతలు బిజీబిజీగా మారారు. కొడంగల్ మండలంలోని టేకులకోడ్‌లో వడ్రంగి వద్ద రైతులు పనిముట్లు తయారు చేస్తూ ఆంధ్రజ్యోతికి కనిపించారు.

- కొడంగల్ రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి)

పాఠశాలల పునఃప్రారంభంలోపు

యూనిఫాంలు

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు ప్రారంభంలోపు యూనిఫాంలను అందించేందుకు సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి బడిబాట, ఇందిరా మహిళా శక్తి భవనాలు, సౌర విద్యుత్ ప్లాంట్ల గ్రౌండింగ్, పెట్రోల్ పంపులు ఏర్పాటు, అర్హత ఉన్న మహిళలందరిని స్వయం సహాయ సంఘాల్లోకి చేర్చుకోవడంతో పాటు కొత్తగా ఎంపికైన గ్రూపు నాయకులకు జిల్లా స్థాయిలో శిక్షణ, అంగవైకల్యం కలిగిన వారి నిర్ధారణ నిమిత్తం సదరం/యూడీఐ కింద మూల్యాంకనం తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియోకాన్ఫరెన్స్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు అందించేందుకు 65వేల యూనిఫాంలు అవసరం ఉండగా 61 వేల యూనిఫాంలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అలాగే ఇందిరమ్మ మహిళా శక్తి భవనాన్ని కలెక్టరేట్ ఆవరణలో నిర్మించినట్లు తెలిపారు. మహిళలను ప్రోత్సహించే దిశగా పెట్రోల్ బంకుల ఏర్పాటుకు స్థలాల కేటాయింపునకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, డీఆర్డీఓ శ్రీనివాస్, డీపీవో జయసుధ, డీఈవో రేణుకాదేవి, వయోజన విద్యాధికారి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా..

ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రజలకు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజలను అర్జీలను స్వీకరించారు. ఆయనతో పాటు అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్డీవో వాసుచంద్ర తదితరులున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి అధికారులకు కృషి చేయాలన్నారు. చౌకధరల దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కాగా, ప్రజావాణిలో మొత్తం 84 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

బడి బస్సు భద్రమేనా?

రెండు రోజుల్లో తెరచుకోనున్న స్కూళ్లు

మరో రెండు రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. బడిలో అడుగు పెట్టేందుకు విద్యార్థులు సన్నద్ధం అవుతున్నారు. కానీ నిత్యం వారు ప్రయాణించే బస్సుల ఫిట్‌నెస్ మాత్రం ప్రశ్నార్థకంగానే ఉంటుంది. ప్రైవేట్ స్కూళ్ల బస్సులు రోడ్డెక్కాలంటే ఫిట్‌నెస్ తప్పనిసరి. రవాణా శాఖ అప్రమత్తం చేస్తున్నా స్కూళ్ల యాజమాన్యాలు కనీసం పట్టించుకోని పరిస్థితి. జిల్లా వ్యాప్తంగా 195 ప్రైవేట్ పాఠశాలలు ఉండగా 350 బస్సులు వినియోగిస్తున్నట్లు అంచనా. ఇందులో కేవలం 250 బస్సులకే రిజిస్ట్రేషన్ ఉండటం గమనార్హం. మరో 150కిపైగా బస్సులు ఎలాంటి అనుమతులు లేకుండా రోడ్లపైనే తిప్పుతున్నారని తెలుస్తోంది.

ఫిట్‌నెస్ లేని వాహనాలతో సమస్య

నిబంధనలు పాటించని యాజమాన్యాలు

విద్యార్థుల భద్రతపై అనుమానాలెన్నో..

జిల్లాలో దాదాపుగా 350పైగా బస్సులు

అనధికారికంగా మరో150 నడుపుతున్నట్లు అంచనా

ఇప్పటివరకు 15% బస్సుల ఫిట్‌నెస్ మాత్రమే పూర్తి



పరిగిలో స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్న ఆర్టీఏ అధికారులు(ఫైల్)

పరిగి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు పిల్లల భద్రతను గాలికొదిలేస్తున్నారు. ఇంటి నుంచి పాఠశాలలకు విద్యార్థుల రాకపోకలను సాగించే బడి బస్సులపై కనీస నిబంధనలు పాటించడం లేదు. ఫిట్‌నెస్ లేకపోవడం, కాలం చెల్లిన బస్సులనే ఎక్కువగా నడిపిస్తుండడంతో విద్యార్థుల భద్రతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బస్సులు కండిషన్ లేకపోవడంతో ఎక్కడబడితే అక్కడే రోడ్లపై ఆగిపోయిన సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. బ్రేకులు ఫెయిల్ కావడం, వచ్చిరాని డ్రైవింగ్‌తో రోడ్ల పక్కకు దూసుకపోవడం, ఫిట్‌నెస్‌లేని కారణంగా బస్సుల్లో మంటలు

మిగతా 8వ పేజీలో...

యాజమాన్యాలకు నోటీసులు పంపుతున్నాం



పాఠశాలలు ప్రారంభంలోపే స్కూల్ బస్సులన్నీ ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలి. ఇప్పటికే అన్ని పాఠశాలలకు చెందిన యాజమాన్యాలకు నోటీసులు పంపుతున్నాం. బడి బస్సులు అన్ని విధానాల ఆర్టీఏ నిబంధల మేరకు ఉండాల్సిందే. నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపైకి వస్తే సీజ్ చేస్తాం.

-వీరేంద్రనాయక్, ఎంవీఐ, పరిగి

పాటించాల్సిన నిబంధనలు..

- 15 ఏళ్లు దాటిన బస్సులను విద్యార్థుల రవాణాకు వినియోగించరాదు.
- హెవీ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు, ఐదేళ్ల అనుభవం ఉన్నవారినే డ్రైవర్లుగా నియమించుకోవాలి.
- కంటిచూపు, షుగర్, బీపీ, ఫిట్స్, గుండె జబ్బులు లేనివారిని మాత్రమే డ్రైవర్లుగా నియమించుకోవాలి. ప్రతీ మూడు నెలలకోసారి వారికి వైద్య పరీక్షలు చేయించాలి.
- 60 ఏళ్లు నిండిన డ్రైవర్ల చేత స్కూల్ బస్సులను నడిపించరాదు.
- ప్రతీ స్కూల్ బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఫైర్‌సేఫ్టీ పరికరాలు ఉండాలి.
- విద్యా సంస్థ పేరు, ఫోన్ నంబర్ బస్సుకు ఎడమవైపు వెనుక భాగంలో కనిపించేలా రాయించాలి. బస్సులో అటెండర్‌ను కచ్చితంగా ఉంచాలి.
- చిన్నారులు బస్సు ఎక్కడం, దిగటం డ్రైవర్‌కు స్పష్టంగా కనిపించేలా కుంభాకార అద్దాలను ఏర్పాటు చేయాలి.
- ప్రతీ పది బస్సులకు అదనంగా మరో బస్సును అందుబాటులో ఉంచుకోవాలి.
- ఫుట్‌బోర్డులో మొదటి మెట్టు భూమికి 325 మిల్లీమీటర్ల ఎత్తుకు మించి ఉండకూడదు. మిగతా అన్ని మెట్లు కూడా జారకుండా లోహంతో నిర్మితమై ఉండాలి.
- విద్యార్థుల తల్లిదండ్రులు బస్సులు కండిషన్‌గా ఉన్నాయా? లేదా? అనేది పరిశీలించాలి.
- నిబంధనలకు విరుద్ధంగా కనిపిస్తే స్కూల్ యాజమాన్యాకి లేదా ఆర్టీఏ అధికారులకు ఫిర్యాదు చేయాలి..



గతేడాది పరిగి శివారులోని కుంటలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

పడకేసిన పారిశుధ్యం!

కాగితాలకే పరిమితమైన 100 రోజుల ప్రణాళిక

పట్టించుకోని సంబంధిత అధికారులు

మూడుచింతలపల్లి బల్దియాలో ఇష్టారాజ్యం!

ఆవేదన వ్యక్తం చేస్తున్న పల్లె ప్రజలు

మూడుచింతలపల్లి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధి కోసం 100 రోజుల ప్రణాళికను రూపొందించి ప్రతీరోజూ ఒక కార్యక్రమం చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశాలు జారీ చేసింది. కానీ, జిల్లాలో నూతనంగా ఏర్పాటైన మూడుచింతలపల్లి మున్సిపాలిటీలో మాత్రం ఆ దిశగా చర్యలు కనిపించడం లేదు. ఈ కార్యక్రమాన్ని అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామాల్లో ఎక్కడ చూసినా చెత్తాచెదారం దర్శనమిస్తోంది. పారిశుధ్యం కొరవడడంతో పల్లెలు అస్తవ్యస్తంగా మారాయి. అన్ని గ్రామాల్లో 100 రోజుల ప్రణాళిక కార్యక్రమాన్ని చేపట్టాల్సిన అధికారులు కేవలం

మిగతా 8వ పేజీలో...



రోడ్లపై దర్శనమిస్తున్న చెత్తాచెదారం

చెత్తాచెదారంతో నిండిన గ్రామాలు



సమస్యల పరిష్కారంలో విఫలం

మూడుచింతలపల్లి మున్సిపాలిటీలోని సమస్యలను పట్టించుకోవంలో కమిషనర్ విఫలమైనట్లు మున్సిపాలిటీ ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. కార్యాలయానికి వచ్చామా అధికారులతో చర్చించామా అన్నట్టుగా ప్రవర్తిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటి వరకు గ్రామాల్లో ఏ సమస్యలు ఉన్నాయి? వాటిని ఎలా పరిష్కరించాలి అన్న కోణంలో చర్యలు చేపట్టినట్లు దాఖలు లేవు. అలాగే సమస్యలపై విన్నివిస్తే నిధులు లేవని సమయం పడుతుందని సమాధానం చెప్తుండడం గమనార్హం.

పెరిగిన దోమల బెడద



మూడుచింతలపల్లి మున్సిపాలిటీ కమిషనర్ తీరు బాగా లేదు. గ్రామంలోని సమస్యలపై దృష్టి సారించడం లేదు. గ్రామంలో ఎక్కడ చూసినా చెత్తాచెదారం దర్శనమిస్తోంది. పారిశుధ్యంపై పట్టింపు లేకుండా పోయింది. దీంతో మా కాలనీలోని ఇళ్ల ముందు పిచ్చి మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. దీంతో దోమల బెడద ఎక్కువైంది.

-రమేశ్, నాగిశెట్టిపల్లి గ్రామస్తుడు

ఈవీఎం, వీవీప్యాట్‌ల వేర్‌హౌస్ తనిఖీ

మేడ్చల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఈవీఎం, వీవీప్యాడ్ వేర్‌హౌజ్ గోడౌన్‌ను సోమవారం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్‌తో కలిసి చీఫ్ ఎలక్ట్రోల్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి తనిఖీ చేశారు. పార్టీల ప్రతినిధుల సమక్షంలో వేర్‌హౌజ్ సీల్‌ను తెరిచి గోడౌన్‌లోని ఈవీఎం, వీవీప్యాట్‌లు భద్రపరచిన పెట్టెలను పరిశీలించారు. ఇందుకు సంబంధించిన భద్రత వివరాలను జిల్లా ఎన్నికల అధికారి సీఈవోకు వివరించారు. తనిఖీ అనంతరం వారి సమక్షంలోనే గోడౌన్‌కు తాళం వేసి మళ్లీ సీల్ చేశారు. అంతకు ముందు జిల్లా ఎన్నికల అధికారి పూలమొక్కతో సీఈవోకు స్వాగతం పలికారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డీఆర్‌వో హరిప్రియ, శామీర్‌పేట తహసీల్దార్ యాదగిరిరెడ్డి, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఈవీఎంలను తనిఖీ చేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

ఎక్సైజ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

తాండూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): తాండూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ గులాం సుల్తాన్ మహమ్మద్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు సోమవారం ఎక్సైజ్ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. బంధువుల ద్వారా గంజాయిని విక్రయిస్తూ షాద్‌నగర్ పోలీసులకు పట్టుబడిన విషయం విధితమే. ఈ విషయంలో షాద్‌నగర్ పోలీసులు అతన్ని రిమాండ్‌కు పంపించి ఉన్నతాధికారులకు నివేదికను పంపించారు. పట్టుబడిన గంజాయిని నిర్వీర్యం చేసేందుకు తరలిస్తుండగా కానిస్టేబుల్ మహమ్మద్ గంజాయి ప్యాకెట్‌ను తస్కరించి షాద్‌నగర్‌లోని తన బంధువు అంజద్ ద్వారా విక్రయిస్తున్నాడు. అంజద్ పట్టుబడడంతో విచారణలో కానిస్టేబుల్ మహమ్మద్ ఇచ్చినట్లు తేలింది. వాస్తవమేనని తేలడంతో శాఖపరమైన చర్యలు తీసుకున్నారు.

ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి జయసుధ

కొడంగల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, మానసిక వికలాంగులు ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి జయసుధ సూచించారు. కొడంగల్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం మహిళా శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, సామాజిక న్యాయ సాధికారిత మంత్రిత్వ శాఖ, భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ(అలింకో) ఆధ్వర్యంలో ఉపకరణల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ సహాయ ఉపకరణలు పొందుటకు కనీసం 40 శాతం వైకల్యం ఉన్నావారు అర్హులన్నారు. కాగా, శిబిరంలో 154 మంది దివ్యాంగులు సహాయ ఉపకరణాల కోసం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కొడంగల్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో రజిత, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది, అలింకో సంస్థ సిబ్బంది, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



శిబిరాన్ని పరిశీలిస్తున్న మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి జయసుధ

ఓయూ పీహెచ్‌డీ మ్యాథ్స్ ఎంట్రెన్స్‌లో

ఇద్దరికి టాప్ ర్యాంకులు


కలెట్ల రేఖ


శ్రావణ్‌కుమార్

వికారాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీ (మ్యాథమెటిక్స్) కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఓయూ ఎంట్రెన్స్ టెస్ట్ -2025లో వికారాబాద్ జిల్లాకు చెందిన ఇద్దరు అభ్యర్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. సోమవారం సాయంత్రం ప్రకటించిన ఫలితాల్లో వికారాబాద్ పట్టణంలో రామయ్యగూడకు చెందిన కలెట్ల రేఖ మ్యాథ్స్‌లో 51 మార్కులతో 8వ ర్యాంకు సాధించగా, మర్పల్లి మండలానికి చెందిన యెదిరె శ్రావణ్‌కుమార్ 48 మార్కులతో 16వ ర్యాంకు దక్కించుకున్నారు. మ్యాథ్స్ ఎడ్యుకేషనల్ అకాడమీలో శిక్షణ పొందిన ఈ ఇద్దరూ పీహెచ్‌డీ కోర్సులో చేరేందుకు అర్హత సాధించారు. రేఖ ఉస్మానియా యూనివర్సిటీలో ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్ 2022లో పూర్తి చేయగా, 2023లో టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన జూనియర్ లెక్చరర్ (మ్యాథమెటిక్స్) పోటీ పరీక్షలో 1:2 వరకు ఎంపికైంది. ఇదిలా ఉంటే శ్రావణ్‌కుమార్ 2023లో జరిగిన జూనియర్ లెక్చరర్ పరీక్షలో ప్రతిభ కనబరిచి జెఎల్‌గా ప్రభుత్వ ఉద్యోగం సాధించి ప్రస్తుతం బుదేరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మ్యాథమెటిక్స్ జేఎల్‌గా పని చేస్తున్నారు. తన వద్ద శిక్షణ పొందిన ఇద్దరు అభ్యర్థులకు మ్యాథ్స్ పీహెచ్‌డీలో టాప్ ర్యాంకులు రావడం పట్ల మ్యాథ్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ డైరెక్టర్ రత్నాకర్ హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు సాధించిన ఈ ఘనత జిల్లాకే గర్వకారణమని అన్నారు.


ఇళ్ల మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

పారదర్శకంగా పథకాల అమలు

ఆమనగల్లు, జూన్9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పథకాలను పారదర్శకంగా అమలు చేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ప్రతి కుటుంబం, రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అన్నారు. ఆమనగల్లు, కడ్తాల, వెల్దండ మండలాల్లో సోమవారం ఎమ్మెల్యే పర్యటించి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. అలాగే మంజూరైన వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. తెలంగాణలో అమలు చేస్తున్న ప్రతీ పథకం దేశానికి రోల్ మోడల్ అని చెప్పారు. నిరుపేదలందరికీ దశల వారీగా ఇళ్లు కట్టిస్తామని తెలిపారు. అసంపూర్తి పనులు వేగవంతంగా పూర్తిచేసేందుకు అధికారులు కృషిచేయాలని కోరారు. నియోజకవర్గంలో రూ.500కోట్లతో రోడ్లను విస్తరిస్తామని నారాయణరెడ్డి వెల్లడించారు. కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్, సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి, పర్వత్‌రెడ్డి, మోతీలాల్, ఆనంద్, శ్రీకాంత్‌రెడ్డి, విజయేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సీసీఐ కర్మాగారం పునఃప్రారంభం

తాండూరు రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తాండూరు మండలం కరన్‌కోట్ గ్రామ శివారులోని ప్రభుత్వ రంగ సిమెంటు కర్మాగారం సాంకేతిక లోపంతో బొగ్గు బర్నింగ్ నిలిచిపోయింది. దీంతో సీసీఐ యాజమాన్యం ఐదు రోజులుగా మరమ్మతులు చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. కర్మాగారంలోని పలు కోల్‌మిల్‌లో బాల్ పగిలిపోయి టేబుల్ క్రాక్ వచ్చింది దీంతో సిమెంటు కర్మాగారంలోని కోల్‌మిల్ విభాగంలో నూతనంగా బాల్‌ను ఏర్పాటు చేసి బొగ్గు బర్నింగ్ పనిచేసే విధంగా చర్యలు చేపట్టారు. దీంతో సిమెంటు ఉత్పత్తులకు ఇబ్బందులు కలగకుండా నేడు(మంగళవారం) కర్మాగారం పునః ప్రారంభమయ్యే అవకాశం ఉందని కార్మికులు పేర్కొంటున్నారు.

మండల సాధనకు కొనసాగుతున్న రిలే దీక్షలు

తలకొండపల్లి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): గట్టిప్పలపల్లిని రాష్ట్ర ప్రభుత్వం మండల కేంద్రం ఏర్పాటు చేయాలని, అందుకు ఆమరణ నిరహార దీక్షకు దిగుతామని మండల సాధన జేఏసీ నాయకులు అన్నారు. గట్టిప్పలపల్లిని మండలం చేయాలని చేపట్టిన రిలే దీక్షలు సోమవారానికి 224వ రోజుకు చేరాయి. దీక్షల్లో నాయకులు, యువకులు, మెదక్‌పల్లి, వెంకట్రావ్‌పేట, బొమ్మరాశిపల్లి వాసులు పాల్గొంటున్నారు. 11పంచాయతీలను కలిపి కొత్త మండలం చేయాలని వారు దీక్షబూనారు. ఇందుకు ప్రజాప్రతినిధులు చొరవతీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

● విద్యుత్ స్తంభాలు, రెండు ట్రాన్స్‌ఫార్మర్లకు ఢీ
● ద్విచక్ర వాహనదారుడితో పాటు పలువురికి గాయాలు


విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

కందుకూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి ఆర్టీసీ బస్సు అదుపు తప్పి రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలను ఢీకొన్న ఘటన కందుకూరులోని కొత్తగూడ గేటు వద్ద సోమవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు, బస్సులోని పది మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. బస్సు ఢీకొట్టిన వెంటనే సబ్‌స్టేషన్‌కు సరఫరా చేస్తున్న మామిడిపల్లి, ఇబ్రహీంపట్నం విద్యుత్ లైన్ బ్రేక్‌డౌన్ కావడంతో పెను ముప్పు తప్పింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. జైత్వారానికి చెందిన సంగెం శ్రీశైలం ఉదయం 6గంటల సమయంలో తన భార్య శ్రీలత, కుమారుడు ప్రణీత్‌కుమార్‌లతో కలిసి బైక్‌పై కందుకూరు చౌరస్తా నుంచి గ్రామానికి వెళ్తున్నారు. కొత్తగూడ చౌరస్తా వద్ద శ్రీశైలం నుంచి వస్తున్న అచ్చంపేట డిపో బస్సు బైక్‌ను ఢీకొని పక్కనే ఉన్న రెండు ట్రాన్స్‌ఫార్మర్లు, మామిడిపల్లి, ఇబ్రహీంపట్నం నుంచి కందుకూరుకు సరఫరా చేసే 33/11కేవీ విద్యుత్ స్తంభాలను ఢీకొట్టింది. వెంటనే లైన్ బ్రేక్‌డౌన్ కావడంతో ప్రయాణికులకు ప్రాణాపాయం తప్పింది. విద్యుత్ సరఫరా అలాగే ఉంటే షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగేవి. కాగా బైక్‌పై ఉన్న శ్రీశైలం, శ్రీలత, ప్రణీత్‌కుమార్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. బస్సులోని 10 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. శ్రీశైలం తమ్ముడు ప్రభాకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. బస్సు ట్రాన్స్‌ఫార్మర్లు, 33/11కేవీ స్తంభాలను ఢీకొట్టగా కందుకూరు సబ్‌స్టేషన్ నుంచి కొత్తగూడ, కందుకూరు, కందుకూరు టౌన్ ఫీడర్లకు సరఫరా నిలిచిపోయింది. డీఈ గోపాలకృష్ణ, ఏడీఈ శంకర్‌నాయక్, ఏఈ వేణుగోపాల్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని మొదట కడ్తాల్ మండలం నుంచి కందుకూరు ఫీడర్‌కు కనెక్షన్ ఇచ్చారు. కొత్తగూడ, కందుకూరు ఫీడర్లకు సరఫరా చేసేందుకు సాయంత్రం వరకు రిపేర్లు కొనసాగాయి.

దళిత, ప్రజా సంఘాల ధర్నా


తాండూరు డీఎస్పీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

తాండూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): బెల్కటూర్‌లో పెళ్లి బరాత్ అడ్డుకొని కులం పేరుతో దూషించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దళిత, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో డీఎస్పీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పెత్తందారులను అరెస్టు చేయకుండా అగ్రకుల పెత్తందారులకు కొమ్ముకాస్తున్నారని నాయకులు మండిపడ్డారు. కులవివక్ష, అంటరానితనం, దళితులపై దాడులు జరుగడం సిగ్గుచేటని ఇప్పటికైనా నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ధర్నా చేస్తున్న దళిత, ప్రజా సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సంఘం జిల్లా అధ్యక్షులు చంద్రయ్య, కేవీపీఎస్ జిల్లా నాయకులు సురేష్, ప్రజాసంఘాల నాయకులు అశోక్, మధు, బిచ్చప్ప, మహేష్, ఆనంద్, నవీన్, నగేష్ పాల్గొన్నారు. అలాగే దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌కు దళిత ప్రజాసంఘాల నాయకులువినతిపత్రాన్ని సమర్పించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.మహిపాల్, జిల్లా ఉపాధ్యక్షుడు బుస చంద్రయ్య, చంద్రయ్య రత్నం, సుదర్శన్, రఘుపతి, రాజు, గోపాల్, వీరేశం పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టు దుర్మార్గం

యాలాల: అక్రమంగా ముందస్తు అరెస్టు చేయడం దుర్మార్గమని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య అన్నారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో డీఎస్పీ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్యను ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మల్కయ్య మాట్లాడుతూ దళిత యువకుడి పెళ్లిబరాత్‌ను అడ్డుకున్న మద్దూరు ప్రవీణ్, మద్దూరు అశోక్, ఈడ్గి శివకుమార్, కోడంగంటె చరణ్‌లను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

తపస్ కొడంగల్ నూతన కార్యవర్గం

కొడంగల్ రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ కొడంగల్ మండల నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఇల్లూరి క్రాంతికుమార్ మాట్లాడుతూ ఫ్యామిలీ పెన్షన్‌లోని లోపాలు, ప్రభుత్వం చెల్లించే మ్యాచింగ్ గ్రాంట్స్ జమ కాకపోవడం, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేస్తున్న యూపీఎస్ గురించి, సీపీఎస్ ఉద్యోగులకు సంబంధించిన విషయంలో చర్చించినట్లు తెలిపారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం తమ డిమాండ్లకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు పూర్తిచేయాలి


తాళ్ల రవీందర్

ఆమనగల్లు, జూన్9(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌లో నిలిచిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులను పూర్తిచేయించాలని ఆమనగల్లు మార్కెట్ డైరెక్టర్ తాళ్ల రవీందర్ కలెక్టర్ నారాయణరెడ్డిని కోరారు. సోమవారం కలెక్టరేట్ ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పూర్తికాక మాంసం, చేపలు, కూరగాయలను రోడ్లపైనే అమ్ముతున్నారని, దీంతో కొనుగోలుదారులు, విక్రయదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అవసరమైన నిధులు వెంటనే విడుదల చేసి పనులు పూర్తిచేయించాలని కలెక్టర్‌ను కోరారు.

పేదల సొంతింటి కల సాకారం

డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి


ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పేదల సొంతింటి కల సాకారం అవుతోందని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కడ్తాలలో సోమవారం ఇళ్ల నిర్మాణానికి స్థానిక నాయకులతో కలిసి ఆయన భూమి పూజ చేశారు. లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ప్రజల ఆకాంక్షలకనుగుణంగా ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో అవకాశవాద పార్టీలను ప్రజలు తరిమేయడం తథ్యం అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అల్లాజీ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మంకి శ్రీను, జహంగిర్‌బాబ, యాదయ్యగౌడ్, జంగమ్మ, నాయకులు లక్ష్మయ్య, సత్యంయాదవ్, బిక్షపతి, మల్లయ్య, ఎం.కృష్ణ, జంగయ్య, మహేశ్, రమేశ్, రవి, భానుకిరణ్, ఇమ్రాన్‌బాబ తదితరులు పాల్గొన్నారు.


ప్రవీణ్‌కుమార్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న అందె బాబయ్య

బీజేపీతోనే అభివృద్ధి, సంక్షేమం

కొత్తూర్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే అభివృద్ధి, సంక్షేమం ఉంటుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు అందె బాబయ్య పేర్కొన్నారు. కుమ్మరిగూడకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు, న్యాయవాది ప్రవీణ్‌కుమార్ బాబయ్య సమక్షంలో కొత్తూర్‌లోని ఓ రిసార్టులో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీలో చేరారు. ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బాబయ్య మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ పాలనతో ఆకర్షితులై వివిధ పార్టీ నాయకులు బీజేపీలో చేరుతున్నారని గుర్తు చేశారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలోపార్టీ మున్సిపల్ అధ్యక్షుడు రణధీర్‌గౌడ్, నాగరాజుచారి, మహేందర్‌రెడ్డి, ప్రదీప్, అరవింద్ పాల్గొన్నారు.

మోదీ పథకాలను ప్రజలకు వివరించాలి

షాద్‌నగర్ రూరల్: వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య అన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం 11ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా బీజేపీ ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు పిట్టల సురేష్ అధ్యక్షతన సోమవారం నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. బాబయ్య మాట్లాడుతూ ఎలాంటి అవినీతి, కుంభ కోణాలు కాకుండా స్వచ్ఛమైన పాలన అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేష్, నాయకులు ఇసునాతి శ్రీనివాస్, ప్రశాంత్, గణేష్, నర్సింహ్మ, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రిప్, స్ప్రింక్లర్లతో సాగు చేపట్టాలి

యాచారం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): నీటిని పొదుపుగా వాడి పంటలు సాగు చేసుకోవాలని, డ్రిప్, స్ప్రింక్లర్లతో సాగుచేసుకుంటే నీటి వాడకం భారీగా తగ్గుతుందని రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ డైరెక్టర్ శ్రీనివాస్ రైతులకు సూచించారు. సోమవారం నజ్దిక్‌సింగారం, మొండిగౌరెల్లి గ్రామాల్లో ఆరు తడిపంటల సాగుపై అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏవో రవినాథ్, శాస్త్రవేత్తలు సునీత, కిరణ్‌కుమార్, రాజేశ్వర్‌నాయక్


మాట్లాడుతున్న వ్యవసాయ వర్సిటీ డైరెక్టర్ శ్రీనివాస్


మక్తగూడలో గొర్రెలకు టీకాలు వేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

జీవాలు ఆరోగ్యంగా ఉంటేనే కాపరులకు లాభం

షాబాద్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకలు ఆరోగ్యంగా ఉండేలా కాపరులు జాగ్రత్తలు తీసుకోవాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం మక్తగూడలో గొర్రెలు, మేకలకు చిటుక వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఆ సందర్భంగా మాట్లాడుతూ.. జీవాలకు రోగాలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అందుకు పశువైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బాల్‌రాజ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణానికి స్థలాన్ని పరిశీలించాలి


డీటీకి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

షాబాద్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మన్‌మర్రిలో క్రీడాప్రాంగణానికి స్థలాన్ని పరిశీలించాలని గ్రామస్తులు సోమవారం రెవెన్యూ సదస్సులో డిప్యూటీ తహసీల్దార్ మధుకు వినతి పత్రం ఇచ్చారు. గ్రామంలో యువకులు, విద్యార్థులు ఆడుకునేందుకు స్థలం లేదన్నారు. గ్రామంలో క్రీడాప్రాంగణానికి స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సత్యం, అంజయ్య, మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహులుగౌడ్, కె.నర్సింహులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన


ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ

మూడుచింతలపల్లి జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు ప్రతీఒక్కరు కృషిచేయాలని మూడుచింతలపల్లి మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మాపూర్‌లో సోమవారం ప్లాస్టిక్ నిషేదంపై ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.ప్లాస్టిక్ ఉపగిస్తే జరిమానా విధిస్తామని పలు దుకాణదారులకు హెచ్చరించారు. లక్ష్మాపూర్‌లో ప్రైమరీ స్కూల్‌లో మొక్కలు నాటారు. అనంతరం ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి భూమి పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆంజనేయులు, అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ శరణార్థులపై చర్యలు తీసుకోవాలి

రాష్ట్ర బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు

రంగారెడ్డి అర్బన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అక్రమ శరణార్థులను తక్షణమే గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు డిమాండ్ చేశారు. ఈ మేరు సోమవారం రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి వినతి ప్రతం అందించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ మయన్మార్ నుంచి శరణార్థులుగా చెప్పబడుతున్న రోహింగ్యా ముస్లిం సంతతికి చెందిన వ్యక్తులు పెద్ద సంఖ్యలో అక్రమంగా నివసిస్తున్నారన్నారు. వారందరిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రభుత్వ అనుమతులు లేకుండా కొనసాగుతున్న మదర్సాలు చాలా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

మేడ్చల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రజాసమస్యలను సత్వరం పరిష్కరించాలని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో డీఆర్‌వో హరిప్రియతో కలిసి అదనపు కలెక్టర్ ఫిర్యాదులను స్వీకరించారు. వివిధ శాఖల్లో ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంటవెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణిలో 70ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లా ఆఫీసర్ చంద్రవతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ ఘట్‌కేసర్ ప్రధాన కార్యదర్శులుగా పోలు భాస్కర్‌గౌడ్, మన్యం

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులుగా ఎదులాబాద్‌కు చెందిన పోలు భాస్కర్‌గౌడ్, కొర్రెములకు చెందిన మన్యంలు నియమించారు. ఈమేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, ఎంపీ ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో నియామక పత్రం అందజేసి అనంతరం శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బసవ రాజు గౌడ్, నాయకులు కాలేరు రామోజీ, సురేష్ పాల్గొన్నారు.


ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

కాంగ్రెస్ పాలనలోనే పేదలకు న్యాయం

నందిగామ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు న్యాయం జరుగుతోందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం నందిగామలో ఇందిరమ్మ ఇళ్లకు ఎమ్మెల్యే నాయకులతో కలసి భూమిపూజ చేసి ఇళ్ల ప్రొసీడింగ్‌లు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతీ నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తామన్నారు. పదేళ్ల పాలనలో బీఆర్‌ఎస్ పాలకులు ఒక్క ఇళ్లయినా కట్టివ్వలేదని, డబుల్ బెడ్ రూం ఇళ్ల పేరిట కాలంగడిపారని ఆరోపించారు. రానున్న నాలుగేళ్లలో ప్రతీ పేద కుటుంబానికి ప్రభుత్వ పథకాలను వర్తింపజేస్తామన్నారు. కార్యక్రమాల్లో నాయకులు జంగ నర్సింలు, శివశంకర్‌గౌడ్, క్రిష్ణ, చంద్రపాల్‌రెడ్డి, కుమార్‌గౌడ్, కృష్ణ, పాండురంగారెడ్డి, సుమన్, జంగయ్యగౌడ్, వెంకట్‌రెడ్డి, నర్సింలు పాల్గొన్నారు.

దరఖాస్తులకు అవకాశం కల్పించాలి

కందుకూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): నేదునూరుకు చెందిన 339 కుటుంబాల వారు ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని గ్రామస్తులు, మాజీ వైస్‌ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అఫ్జల్‌బేగ్ సోమవారం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. నేదునూరులో 1,500 కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. గతంలో ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలనలో అన్ని కుటుంబాలవారు దరఖాస్తు చేసుకున్నా 339 మంది కుటుంబాల దరఖాస్తులు ఆన్‌లైన్ చూయలేదన్నారు. తెల్లరేషన్‌కార్డు, ఉచితవిద్యుత్, గ్యాస్ సబ్సిడీ, ఇందిరమ్మ ఇళ్లు తదితర పథకాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు పాండురంగారెడ్డి, పుష్పాదర్శన్, అజారుద్దీన్, పర్వేజ్ పాల్గొన్నారు.

స్టైపెండ్ చెల్లించాలని.. వైద్య విద్యార్థుల ఆందోళన

చేవెళ్లలో పట్నం మహేందర్ రెడ్డి వైద్య కళాశాల వద్ద నిరసన

చేవెళ్ల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : గత ఏడు నెలలుగా స్టైపెండ్ ఇవ్వడం లేదని రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పట్టణ కేంద్రంలోని పట్నం మహేందర్‌రెడ్డి వైద్య కళాశాల విద్యార్థులు సోమవారం ఆందోళన చేశారు. ఎంబీబీఎస్, పీజీ చదువు పూర్తిచేసిన వైద్యులకు యాజమాన్యం స్టైపెండ్ ఇవ్వడం లేదని కళాశాల ఎదుట ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్లకార్డులు పట్టుకుని నేలపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఎన్‌ఎంసీ నిబంధనల ప్రకారం ఇంటర్న్‌షిప్ స్టైపెండ్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఈ విషయమై కళాశాల నిర్వాహకులను వివరణ కోరగా ఇంటర్న్‌షిప్ స్టైపెండ్ అనేది ప్రతి వైద్య కళాశాలలో అంతర్గత విషయమన్నారు. ఈ సమస్యను పరిష్కరించుకుంటామని తెలిపారు.


చేవెళ్ల పట్టణ కేంద్రంలోని పట్నం మహేందర్‌రెడ్డి వైద్య కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న వైద్యులు

ప్రభుత్వ భూమి స్వాధీనం.. హైకోర్టు రిలీఫ్ ఆర్డర్

- ప్రభుత్వ భూమిలో ఉన్న బోర్డును పడగొట్టి దున్నిన పిటిషనర్లు

ధారూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేసిన ప్రభుత్వ భూమిని అధికారులు స్వాధీనం చేసుకోవడంపై హైకోర్టు పిటిషనర్లకు రిలీఫ్ ఆర్డర్లు జారీచేసింది. దీంతో పిటిషనర్లు ఆ ప్రభుత్వ భూమిలో పాతిన బోర్డును పడగొట్టి ట్రాక్టర్‌తో దున్నివేశారు. వివరాల్లోకి వెళ్తే.. ధారూరు రెవెన్యూ పరిధిలోని సర్వేనంబరు 197/5లో 2-04ఎకరాలు, సర్వే నంబరు 136/1లో 0-04 ఎకరాలు పత్తి ఎల్లప్ప నుంచి అవుసుపల్లి లక్ష్మి కొనుగోలు చేసి పట్టా చేసుకున్నారు. సర్వే నంబరు 197/4లో 2-04ఎకరాల అసైన్‌మెంట్ భూమిని ధారూరుకు చెందిన శెట్టి లలితదేవి కొనుగోలు చేసి పట్టా చేసుకున్నారు. కాగా వీరు కొనుగోలు చేసిన అసైన్‌మెంట్ భూములపై అందిన ఫిర్యాదు ఆధారంగా తహసీల్దార్ సాజిదాబేగం విచారణ జరిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఈ భూములను కొనుగోలు చేసినట్లు గుర్తించి గత ఏప్రిల్ 25న ఈ భూములను స్వాధీనం చేసుకుని బోర్డు పాతారు. దీంతో అవుసుపల్లి లక్ష్మి, శెట్టి లలితాదేవిలు తహసీల్దార్ ఉత్తర్వులను హైకోర్టులో సవాలు చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లను పరిశీలించిన పిటిషనర్లకు హైకోర్టు రిలీఫ్ ఆర్డర్ జారీ చేసింది. ఈ ఆర్డర్ ప్రకారం పిటిషనర్లు పై సర్వే నంబర్లలో పాతిన ప్రభుత్వ బోర్డును పడగొట్టి ట్రాక్టర్‌తో దున్ని కబ్జాలోకి వచ్చారు.

బోర్డును తిరిగి పాతిన అధికారులు

పిటిషనర్లు బోర్డు పాతిన విషయం తెలుసుకున్న తహసీల్దార్ సాజిదా బేగం రెవిన్యూ అధికారులను అక్కడికి పంపించి పడగొట్టిన బోర్డును తిరిగి పాతించారు. హైకోర్టు రిలీఫ్ ఆర్డర్‌ను లైజనింగ్ అధికారికి పంపించామని, హైకోర్టు ఆర్డర్‌పై జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపిస్తున్నట్లు డీటీ విజయేందర్ తెలిపారు. హైకోర్టు ఆర్డర్‌పై ఉన్నతాధికారుల ఆదేశాలు అందిన తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు.


ప్రభుత్వ భూమిలో పడగొట్టిన బోర్డు

పాంబండ గిరి ప్రదక్షిణకు దారి సమస్య


పాంబండ దేవాలయానికి వెళ్లే మార్గంలో అడ్డంగా వేసిన రాళ్లు

కులకచర్ల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమి రోజు (బుధవారం) నిర్వహించే పాంబండ గిరి ప్రదక్షిణకు దారి సమస్య ఏర్పడింది. గిరి ప్రదక్షిణ నిర్వహించే దారి దున్ని రైతు రాళ్లు అడ్డుగా వేశాడు. వివరాల్లోకి వెళ్తే.. బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని పాంబండ శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయం చుట్టూ 29 నెలలుగా హిందూ బంధువుల ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నారు. గిరిప్రదక్షిణ రోజురోజుకు ప్రజల ఆదరణ పెరుగుతోంది. వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొంటున్నారు. గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులు ముఖ ద్వారం నుంచి ప్రారంభమై బొంరెడ్డిపల్లి బీటీరోడ్డు వెనక నుంచి గురుకుల పాఠశాల, బండవెల్కిచర్ల బీటీ రోడ్డు మీదుగా పాంబండకు చేరుకుంటారు. బొంరెడ్డిపల్లి బీటీ రోడ్డు, బండవెల్కిచర్ల బీటీరోడ్డు మధ్య రైతుల పొలాలు ఉన్నాయి. రైతుల పొలాల్లో ఉన్న దారి మీదుగా గిరి ప్రదక్షిణకు భక్తులు వెళ్తుంటారు. మధ్యలో పొలం ఉన్న ఓ రైతు పొలంలో ఉన్న దారిని దున్ని భక్తులు వెళ్లకుండా అడ్డంగా రాళ్లు వేశాడు. గిరిప్రదక్షిణకు వచ్చే భక్తులకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంది. అధికారులు స్పందించాలని భక్తులు కోరుతున్నారు.

ఉపాధ్యాయులకు ఊరట

- 'సర్దుబాటు' గడువు జూలై 15 వరకు పెంపు
- పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు
- హర్షం వ్యక్తం చేస్తున్న టీచర్లు

వికారాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేసే గడువును జూలై 15వ తేదీ వరకు పొడిగిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మొదట నిర్దేశించిన విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తికి అనుగుణంగా ఈనెల 13వ తేదీలోగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని పాఠశాల విద్యా డైరెక్టర్ మొదట ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. సర్దుబాటు రగడ.. విద్యార్థుల ప్రవేశాల వేళ ఉపాధ్యాయుల సర్దుబాటు శీర్షికన ఈనెల 7వ తేదీన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కాగా, విద్యార్థుల ప్రవేశాలు ముగిసిన తర్వాత ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలంటూ ఉపాధ్యాయ సంఘాల నేతలు డైరెక్టర్, ప్రిన్సిపల్ సెక్రటరీకి విజ్ఞప్తి చేశారు. ఎట్టకేలకు స్పందించిన పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వచ్చేనెల 15వ తేదీ వరకున్న విద్యార్థుల ప్రవేశాలను పరిగణనలోకి తీసుకుని ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలంటూ ఆదేశాలు జారీ చేశారు. ఈ ఉత్తర్వులతో విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు కొంత ఊరట కలిగించింది. పాఠశాలల్లో బడీడు పిల్లలను చేర్పించేందుకు గడువు లభించడంతో ఉపాధ్యాయుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

యూనివర్సిటీలో సీటు సాధించిన విద్యార్థినికి సన్మానం


అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీలో సీటు సాధించిన జగ్జీవనీ, తల్లిదండ్రులను సన్మానించిన టీవీవీ నాయకులు

బొంరాస్‌పేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో అతి ప్రాముఖ్యమైన యూనివర్సిటీల్లో అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ ఒకటి. యూనివర్సిటీ నిర్వహించిన అర్హత పరీక్షలో బొంరాస్‌పేట్ మండలంలోని రేగడిమైలారం గ్రామానికి చెందిన జర్నలిస్టు అంజిలయ్య కూతురు జగ్జీవనీ అత్యుత్తమ మార్కులు సాధించిన సీటు సాధించింది. ఈ సందర్భంగా సోమవారం టీవీవీ ఆధ్వర్యంలో రవీందర్‌గౌడ్, బాకారం చంద్రశేఖర్, గౌరారం గోపాల్, పల్నాటి అనిల్‌కుమార్, లక్ష్మి, విజయలక్ష్మి, వెంకటేశ్, బాకారం మల్లయ్య విద్యార్థిని జగ్జీవనీతో పాటు తల్లిదండ్రులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. తమ వంతుగా రూ.5వేలు నగదు ప్రోత్సాహాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, ఎంఈవోలు హరిలాల్, విజయరామారావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, వెంకట్రాములుగౌడ్, విజయ్‌వర్ధన్ పాల్గొన్నారు.


మహిళలకు అవగాహన కల్పిస్తున్న సంధ్య

పరిశుభ్రత అందరి బాధ్యత

షాద్‌నగర్ రూరల్, జూన్9(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిశుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యత అని మునిసిపల్ శాఖ జాయింట్ డైరెక్టర్ సంధ్య అన్నారు. షాద్‌నగర్ లో జరుగుతున్న స్వచ్ఛత కార్యక్రమాలను సోమవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను వేరు చేయాలన్నారు. 11వ వార్డు మహిళలతో మాట్లాడారు. చెత్తను మునిసిపల్ ఆటోల్లోనే వేయాలన్నారు. పదో వార్డులో ఉన్న కంపోస్ట్ యార్డును, ఎనిమల్ బర్త్ సెంటర్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆమె వెంట మున్సిపల్ కమిషనర్ సునీత ఉన్నారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మానం

బొంరాస్‌పేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్షాఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు విద్యార్థులను సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో హరిలాల్, టీవీవీ నాయకులు రవీందర్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు నర్సింహులు గౌడ్, జయకృష్ణ, రాంచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు రూ.1.76కోట్లు



వివరాలు వెల్లడిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ గీతానర్సింహ

ఆమనగల్లు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడుగుల మండలాలకు వివిధ పనుల కోసం రూ.1.76 కోట్లు మంజూరయ్యాయని ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ తెలిపారు. మార్కెట్ యార్డులో సోమవారం పనుల వివరాలను ఆమె వివరించారు. నాలుగు మండలాల్లో నాలుగు పంచాయతీ, 8 అంగన్‌వాడీ భవనాలకు రూ.1.76కోట్లను ప్రభుత్వం కేటాయించిందన్నారు. కడ్తాల్‌మండలం మక్తమాదారం, ఆమనగల్లు మండలం చెన్నంపల్లి, తలకొండపల్లి మండలం దేవునిపడకల్, మాడుగుల మండలం జయరాం తండాలకు పంచాయతీ భవనాలు మంజూరయ్యాయని గీత చెప్పారు. ఒక్కో పంచాయతీని రూ.20లక్షలతో నిర్మిస్తామని తెలిపారు. అలాగే నల్లవారిపల్లి, అందుగుల, మంగళపల్లి, చెన్నకేశవ కాలనీ, తలకొండపల్లి, రాంపూర్, గోవిందాయిపల్లి, నార్లకుంట తండాల్లో అంగన్‌వాడీ భవనాలు మంజూరయ్యాయని, ఒక్కో భవనాన్ని రూ.12లక్షలతో నిర్మిస్తామని చెప్పారు. ఆయా పనులకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో త్వరలో శంకుస్థాపన చేస్తామని చైర్‌పర్సన్ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ఎలివేటర్ కారిడార్ నిర్మాణంపై ప్రజాభిప్రాయ సేకరణ

శామీర్‌పేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట ఓఆర్ఆర్ జంక్షన్ వరకు ప్రభుత్వం నిర్మించనున్న ఎలివేటర్ కారిడార్ నిర్మాణంపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు మేడ్చల్ జిల్లా తూంకుంట మున్సిపాలిటీ కమిషనర్ వెంకటగోపాల్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని హకీంపేట, తూంకుంట, దేవరయాంజాల్ ప్రాంత వాసులతో ఈనెల 11న ఉదయం 10.30గంటలకు తూంకుంట మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆయా ప్రాంత వాసులు పాల్గొని తమ అభిప్రాయాలు తెలపాలని కోరారు.

ఆస్పత్రిలో సదుపాయాలకు ప్రతిపాదనలు పంపాలి

వికారాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో కావాల్సిన సదుపాయాలకు ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను సూచించారు. పట్టణ కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిని సోమవారం సాయంత్రం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీచేశారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఏమైనా మరమ్మతులు అవసరమైతే ప్రతిపాదనలు సమర్పించాలని పంచాయతీ రాజ్ ఈఈ ఉమేష్ కుమార్‌కు సూచించారు. కలెక్టర్ వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ రామచంద్రయ్య ఉన్నారు.

నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించాలి


అధికారులతో సమీక్షిస్తున్న తాండూరు వ్యవసాయ శాఖ ఏడీ రుద్రమూర్తి

తాండూరు రూరల్, జూన్ 9, (ఆంధ్రజ్యోతి): తాండూరు సబ్ డివిజన్ పరిధిలోని బషీరాబాద్, యాలాల, తాండూరు, పెద్దేముల్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో రైతులకు నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించాలని తాండూరు వ్యవసాయ శాఖ ఏడీఏ రుద్రమూర్తి ఆదేశించారు. తాండూరు వ్యవసాయ సబ్ డివిజన్‌కు చెందిన ఏవోలు, ఏఈవోలకు సోమవారం నకిలీ విత్తనాలపై గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులను చైతన్య పర్చాలని కోరారు. తాండూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ఒకటి, రెండు గ్రామాల్లో ఇప్పటికే నకిలీ విత్తనాలు అమ్మేందుకు వచ్చి పట్టుబడ్డారని, అటువంటివారిపై జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయాధికారులు కొమరయ్య, తదితర గ్రామాల ఏఈవోలు పాల్గొన్నారు.

డీలర్లు అప్రమత్తంగా ఉండాలి

నకిలీ విత్తనాలపై ఫర్టిలైజర్, పెస్టిసైడ్ డీలర్లు అప్రమత్తంగా ఉండాలని ఏడీఏ రుద్రమూర్తి అన్నారు. తాండూరు సబ్ డివిజన్ డీలర్లు, పోలీసులతో సోమవారం ఏడీఏ సమీక్షించారు. ఈ సందర్భంగా రుద్రమూర్తి మాట్లాడుతూ డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలు మాత్రమే విక్రయించాలని, నిర్ణీత ధరలకే అమ్మాలని ఆదేశించారు. ఎక్కడైనా నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్లు సమాచారం అందితే వెంటనే సమాచారం అందించాలని కోరారు. అనంతరం వ్యవసాయ శాఖ, పోలీసులు నకిలీ విత్తనాలపై తీసుకుంటున్న చర్యలపై మండల వ్యవసాయాధికారి కొమరయ్య వివరించారు. ఈ కార్యక్రమంలో డీలర్లు, వ్యవసాయాధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

కనుల పండువగా బీరప్ప కల్యాణం



యాచారం, జూన్ 9(ఆంధ్రజ్యోతి):మండలంలోని తమ్మలోనిగూడలో సోమవారం బీరప్పస్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. ఒగ్గు కళాకారులు, కురుమల ఉత్సవాన్ని జరిపించారు. బోనం మేకల, గొర్ల మందలపై బలివేసుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కల్యాణం జరిపారు. యాచారం, కందుకూరు, మంచాల, ఇబ్రహీంపట్నం మండలాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఉత్సవాల సందర్భంగా సాగర్-హైదరాబాద్ రహదారిపై ట్రాఫిక్ స్తంభించడంతో సీఐ నందీశ్వర్‌రెడ్డి, ఎస్సై మధు క్లియర్ చేశారు. వేడుకకు మాజీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి, బీఎన్‌రెడ్డి ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి హాజరయ్యారు. ప్రతీ వ్యక్తి దైవభక్తిని అలవర్చుకోవాలని కోరారు. పూజల్లో నాయకులు దెంది రాంరెడ్డి, కె.శ్రీనివాస్‌రెడ్డి, పాశ్యబాషా, శివ, బల్లయ్య, రాజేందర్‌రెడ్డి, రమేష్, జగదీష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ప్లాట్ల హద్దురాళ్లు, గదులను ధ్వంసం చేసినవారిపై చర్యలు తీసుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తమ ప్లాట్ల హద్దురాళ్లు, నిర్మించుకున్న గదులను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కొర్రెముల ఏకశీలనగర్ ప్లాట్ ఓనర్స్ డిమాండ్ చేశారు. వారు సోమవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పోచారం మున్సిపాలిటీ, కొర్రెముల ఏకశీలనగర్ వెంచర్‌లోని తమ ప్లాట్ల హద్దురాళ్లతో పాటు ప్లాట్లలో నిర్మించుకున్న గదులను రాత్రి నారపల్లికి చెందిన షబ్బీర్, ఉపేందర్, వెంకటేష్, నవాబ్‌తో పాటు మరో పదిమంది తొలగించారని తెలిపారు. ఇదేమిటని ప్రశ్నిస్తే దాడిచేసి భయభ్రాంతులకు గురి చేసి బెదిరించి బంగారు అభరణాలు లాక్కెల్లారని ఆరోపించారు. అధికారులు ప్లాట్ల బాధితులకు న్యాయంచేయాలని కోరారు. అనంతరం పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్‌లో షబ్బీర్, ఉపేందర్, వెంకటేష్, నవాబ్‌లపై ఫిర్యాదు చేశారు.

ప్రతీ ఇంట్లో వర్మికంపోస్టు తయారు చేద్దాం

తాండూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఇంట్లో తడి, పొడి చెత్తను వేరు చేసి వర్మికంపోస్టును తయారు చేద్దామని తాండూరు పట్టణ సాయిపూర్ మహిళ సమాఖ్య సంఘం ప్రతినిధులు ప్రతిజ్ఞ చేశారు. వంద రోజులు కార్యక్రమంలో భాగంగా సోమవారం తాండూరు పట్టణం 9వ వార్డులో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తడి, పొడి చెత్తను వేరు వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని అధికారులు సూచించారు. తడి పొడి చెత్తపై మెప్మా కోఆర్డినేటర్ విశాల, అంటు రోగాలపై ఎన్విరాల్‌మెంట్ ఇంజనీర్ ప్రవీణ్ కుమార్ గౌడ్‌లు మహిళలకు, వార్డు ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నీరజ బాల్‌రెడ్డి, ఇంచార్జ్ కమిషనర్ విక్రం సింహారెడ్డి, మేనేజర్ నరేందర్‌రెడ్డి, టిఎంసి రాజేందర్ ప్రసాద్, కోఆర్డినేటర్ విశాల, నాయకులు బంటు మల్లప్ప, వార్డు ఆఫీసర్ చంద్రశేఖర్, యాదగిరి, ఆర్పి హరిక, జవాన్లు శ్రీనివాస్, వీరన్న, మహిళ సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

కాడెడ్ల ముస్తాబుకు సామగ్రి సిద్ధం


కొడంగల్‌లో కాడెడ్ల ముస్తాబు సామగ్రి విక్రయాలు

కొడంగల్ రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఈనెల 11న వచ్చే ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని రైతన్నలు తమ కాడెడ్లను, ఆవులను ముస్తాబుచేసి పండుగ వేడుకలను నిర్వహించేందుకు సిద్ధం అవుతున్నారు. దీంతో వ్యాపారస్థులు ఏరువాక పౌర్ణమి రోజున అవసరమైయ్యే పచ్చి పసుపు, వార్నిష్ డబ్బాలు, రిబ్బన్ బెండాల్స్, గజ్జేల దండలు, నల్లదారాలు, రంగులు, తదితర సామగ్రిని విక్రయించడం ప్రారంభించారు.

విద్యుద్దీపాలు అమర్చిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



మేడ్చల్ టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): 'గుండ్లపోచంపల్లిలో వెలగని వీధిదీపాలు' శీర్షికన ఆదివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మున్సిపాలిటీ పరిధిలో పలు వీధుల్లో వెలగని వీధి దీపాలను గుర్తించి వాటి స్థానంలో నూతన విద్యుత్ దీపాలను అమర్చారు.

మున్సిపాలిటీల కాంట్రాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడిగా నర్సింహాచారి

కీసర, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నాగారం, దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని కాంట్రాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడిగా కీసరకు చెందిన సింగోజి నర్సింహాచారి ఎన్నికయ్యారు. ఈమేరకు సోమవారం కీసరలో నూతన కమిటీకి ఏర్పాట్లు చేశారు. అధ్యక్షుడిగా నర్సింహాచారి, ప్రధాన కార్యదర్శిగా శివరాత్రి రాజు, ఉపాధ్యక్షులుగా పల్లపు రమేష్, బత్తుల సైదులు, కార్యదర్శిగా రావుల శ్రీను, కోశాధికారిగా ఇర్లుదిండ్ల కృష్ణ, గౌరవ అధ్యక్షుడిగా పల్లపు శ్రీను, పది మంది సలహాదారులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

సన్నబియ్యం పంపిణీ పరిశీలన


ఘనపూర్‌లో బియ్యం పంపిణీ చేస్తున్న ప్రహ్లాద్‌రావు

కులకచర్ల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఘనపూర్‌లోని రేషన్ దుకాణాన్ని బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రహ్లాద్‌రావు సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ముందు చూపుతో మూడు నెలల ఉచిత బియ్యాన్ని పేదలకు పంపిణీ చేస్తుందన్నారు. ఆరు కిలోల్లో ఐదు కిలోలు కేంద్ర ప్రభుత్వమే పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు వెంకటయ్యగౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, మాజీ సర్పంచ్ విజయ లక్ష్మీగోపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యలు పరిష్కరించాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న గ్రామస్తులు

నవాబుపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారేగూడ గ్రామంలో భూసమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. గ్రామస్థులు తహసీల్దార్‌ను కలిసి సోమవారం గ్రామంలోని 560ఎకరాల భూసమస్యను పరిష్కరించాలని కోరారు. ఆలూరుకు చెందిన సీతారామారావుకు సంబంధించిన సర్వే నంబర్ 1 నుంచి 130 వరకు 560 ఎకరాల భూమిని వందేళ్ల కిందట కొనుగోలు చేశామని తెలిపారు. కానీ అప్పట్లో సర్వేచేసి రికార్డు ప్రకారం భూములు ఇవ్వలేదని, కబ్జాలో ఉన్న ప్రకారంగా వందేళ్ల నుంచి దాదాపు 140 మంది రైతులు కబ్జాలో ఉన్నామని తెలిపారు. అయితే గూగుల్ సర్వే ప్రకారం అవి లేవన్నారు. తాము కబ్జాలో ఉన్న ప్రకారం రికార్డులు, గూగుల్ మ్యాప్‌లను మార్చాలని కోరారు. ఈ విషయంపై ఇప్పటికే కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

బీజేపీ పూడూరు మండల కమిటీ ఎన్నిక

పూడూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పూడూరు మండల కమిటీ ప్రధాన కార్యదర్శిగా దేవనోనిగూడాకు చెందిన పెద్దిని ప్రకాష్ యాదవ్ నియమితులయ్యారు. బీజేపీ మండల కమిటీని నియమించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొప్పుల రాజశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా తుంపల్లి రాఘవేందర్, ఉపాధ్యక్షుడిగా నర్సింహారెడ్డి, కుర్వ వెంకటేశ్, కె.రాజు, కొమరబండ నర్సింహా, ప్రధాన కార్యదర్శులుగా పెద్దిని ప్రకాష్ యాదవ్, వి.కృష్ణాచారి, కార్యదర్శులుగా శ్రీకాంత్‌రెడ్డి, టి.బాలమణి, మనోహర్ గౌడ్, ప్రభుగౌడ్, ట్రెజరర్‌గా ఎస్.మంజులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలి


కరపత్రాలు విడుదల చేస్తున్న శాస్త్రవేత్తలు

దోమ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటల సాగులో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలని శాస్త్రవేత్తలు సుధారాణి, లక్ష్మణ్, శేఖర్ అన్నారు. దాదాపూర్ రైతువేదికలో సోమవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పంటల సాగులో మెళవకులు, ఎరువుల వాడకం, యజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరం వ్యవసాయ కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పరిగి ఏడీఏ లక్ష్మికుమారి, మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్‌రావు, విస్తరణ అధికారులు చెన్నయ్య, బాబ్యానాయక్, సంతోష్, శ్రీవణ్‌కుమార్ పాల్గొన్నారు.

బడి బస్సు భద్రమేనా?

(ఐదో పేజీ తరువాయి)


పరిగి: గత డిసెంబర్‌లో పరిగిలో నడిరోడ్డుపై మంటలు చెలరేగిన స్కూల్ బస్సు(ఫైల్)

చెలరేగడం, టైర్లు, ఇతర పరికరాలు రోడ్లపై ఊడిపోవడం లాంటి సంఘటనలు జరుగుతున్నాయి.

పదుల సంఖ్యలో ప్రమాదాలు

తరచూ స్కూల్ బస్సులకు ప్రయాదాలు జరుగుతున్నా పాఠశాలల యజమాన్యాలు, ఆర్టీఏ అధికారులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో పట్టణంలో స్కూల్ బస్సు ప్రమాదంలో ఓ విద్యార్థి మృతి చెందిన సంగతి తెలిసిందే. గతేడాది డిసెంబర్‌లో పరిగి కోర్టు సమీపంలో వెళ్తున్న బస్సులు అకస్మాత్తుగా మంటలు చెలరేగగా, ప్రమత్తతో ఎవరికీ ప్రమాదం జరుగలేదు. పరిగి మండలం సుల్తాన్‌పూర్ గ్రామ శివారులోని చెరువులోకి స్కూల్ బస్సు దూసుకపోయింది. స్థానికులు అప్రమత్తంగా సహాయ చర్యలు చేపట్టడంతో ప్రమాదం తప్పింది. ఇలా జిల్లాలో అనేక చోట్ల స్కూల్ బస్సుల ప్రమాదాలు జరిగాయి.

తూతూమంత్రంగానే తనిఖీలు

ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు నిబంధలు పాటించకుండా పాత బస్సులకు రంగులేసి కొత్త బస్సుల మాదిరిగా కనిపించేలా చేస్తున్నారు. ఆర్టీఏ అధికారులు ఫిట్‌నెస్ చెక్ చేసే సమయంలో బస్సు టైర్లు, పేయింటింగ్, రేడియం స్టిక్కర్లు, లైట్లు, సీట్లు, అద్దాలు, కిటికీలతోపాటు అనుభవం ఉన్న డ్రైవర్లు నడుపుతాన్నారా? లేదా? అనేది సైతం పరిశీలించాల్సి ఉంది. కానీ రవాణ శాఖ అధికారులు నామమాత్రంగానే తనిఖీలు చేస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో 50 వేలకుపైగా విద్యార్థులు చదవుతుండగా, దాదాపుగా 30 వేలకుపైగా విద్యార్థులు నిత్యం బస్సుల్లోనే రాకపోకలు సాగిస్తున్నారు. కొన్ని పాఠశాలలు 20 నుంచి 30 కిలోమీటర్ల దూరం నుంచి విద్యార్థులను తరలిస్తున్నారు. ఈ నెల 12 నుంచి పాఠశాలలు పునప్రారంభం అవుతున్నాయి. ఇప్పటికే అన్ని స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి చేయాల్సి ఉంది. అయితే 15 శాతం బస్సులకు కూడా ఫిట్‌నెస్ పరీక్షలు చేయలేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

పడకేసిన పారిశుధ్యం!

(ఐదో పేజీ తరువాయి)

మూడుచింతలపల్లిలో మాత్రమే చేపడుతున్నారు. మిగితా గ్రామాలను కనీసం పట్టించుకోని పరిస్థితి.

నామ్‌కే వాస్తే కార్యక్రమాలు

మూడుచింతలపల్లి మున్సిపాలిటీలో 100 రోజుల ప్రణాళిక కేవలం గోడలకు బ్యానర్‌గానే పరిమితమైంది. 'నామ్‌కే వాస్తే' కార్యక్రమం చేపట్టామా.. ఫొటోలకు ఫోజులిచ్చామా.. వెళ్లిపోయామా.. అన్నట్టు ఉంది అధికారుల తీరు. ఈ ప్రణాళికలో భాగంగా అధికారులు అసలు ఏ కార్యక్రమాలు చేపడుతున్నారనే విషయం గ్రామస్తులకు సైతం తెలియడం లేదు. ఎవరైనా కార్యక్రమాల గురించి తెలుసుకునేందుకు కమిషనర్ వద్దకు వెళ్తే సారు చాలా బిజీ అని, ఫీల్డ్ విజిట్‌లో ఉన్నారని చెబుతుండటం గమనార్హం. ఇక్కడ విచిత్రం ఏమిటంటే కమిషనర్ ఈజ్ ద బాస్ మూడుచింతలపల్లి మున్సిపాలిటీకి తాను చెప్పిందే ఫైనల్ అని ఆయన చెబుతుండటం పలువురిని ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

సిబ్బంది కొరతతో ఇబ్బందులు



మున్సిపాలిటీ పరిధిలో 100 రోజుల ప్రణాళిక చేపడుతున్నాం. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈ ప్రణాళికను గ్రామాల్లోనూ చేపడుతున్నాం. అన్ని గ్రామాల్లో పూర్తి చేసేందుకు కాస్త సమయం పడుతుంది. కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. సిబ్బంది కొరత వల్ల కాస్త ఇబ్బందులు అవుతున్నాయి.

- పవన్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

పేదల సొంతింటి కల సాకారం


చెల్లాపూర్‌లో లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేస్తున్న డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి

కులకచర్ల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే పేదల సొంతింటి కల సాకారమవుతుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి అన్నారు. చెల్లాపూర్‌లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు అందించారు. అనంతరం ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, యూత్ మండల అధ్యక్షుడు జంగయ్య, స్థానికులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యల పరిష్కారానికే 'భూభారతి'


మర్పల్లి: మాట్లాడుతున్న మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

మర్పల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సంవత్సరాల కాలంగా పెండింగ్‌లో ఉన్న భూసమస్యల పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని అమలు చేస్తుందని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు రాములు యాదవ్ అన్నారు. మండలంలోని కోటమర్పల్లి, మర్పల్లి గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో సోమవారం ఆయన పాల్గొని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పురుషోత్తం, కృష్ణారెడ్డి, సురేశ్ పాల్గొన్నారు.

వికారాబాద్: గొట్టిముక్ల గ్రామంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించి గొట్టిముక్ల, మాదారం గ్రామాలకు చెందించిన రైతు భూ సమస్యలను దరఖాస్తులను స్వీకరించారు.

దుద్యాల: కుదురుమళ్లలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సోమవారం 25 దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ కిషన్‌నాయక్ తెలిపారు. మంగళవారం చిలుముల్‌మైలారంలో రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

బొంరాస్‌పేట్: వడిచర్లలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో భూ సంబంధిత సమస్యలపై ఒక దరఖాస్తును స్వీకరించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

నవాబుపేట: పూలపల్లి, మీనకలాన్ గ్రామాల్లో తహసీల్దార్ బుచ్చయ్య సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత, ఆర్ఐలు రజిత, రాజు, సిబ్బంది ఆసిఫ్, మొహ్మద్ అలీ, శ్రీశైలం, పరమేశ్ పాల్గొన్నారు.

యాలాల: కిష్టాపూర్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో తహసీల్దార్ వెంకటస్వామి పాల్గొని రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ వేణు తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ రూరల్: అంకుశాపూర్, పోచారం మున్సిపాలిటీ ముత్వేల్లిగూడల్లో సోమవారం కీసర ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. అంకుశాపూర్‌లో 63,ముత్వేల్లిగూడలో 21అర్జీలు అందినట్లు తహసీల్దార్ డీఎస్ రజిని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజేందర్, సీనియర్ అసిస్టెంట్ ఆదిత్య, ఆర్ఐలు పాల్గొన్నారు.

కులకచర్ల: అంతారంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ మనోహరచక్రవర్తి పాల్గొన్నారు. రైతుల నుంచి భూ సంబంధిత సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, అంజిలయ్యగౌడ్ పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: ఇందనూర్‌లో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ విజయ్‌కుమార్ పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. అదేవిధంగా కసూర్‌పల్లి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

దౌల్తాబాద్: దేవరఫస్లాబాద్, కౌడీడ్ గ్రామాల్లో తహసీల్దార్ గాయత్రి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రైతుల నుంచి భూ సంబంధిత సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చాంద్‌పాష, సిబ్బంది సునిల్ పాల్గొన్నారు.

తాండూరు రూరల్: మండలంలోని చెనిగేష్‌పూర్, ఉద్దండాపూర్‌లో గ్రామాల్లో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ తారాసింగ్ రైతుల నుంచి 13 దరఖాస్తులు స్వీకరించి వారి సమస్యలు స్వయంగా విన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లలిత, ఆర్ఐ గోపి, ప్రదీప్, నరేష్, ప్రతాప్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా చెనిగేష్‌పూర్ గ్రామంలో రైతులు శేఖర్, శ్రీశైలంగౌడ్, రాజుగౌడ్, ఉద్దండాపూర్‌లో కేశవరావు తదితరులు దరఖాస్తులను రెవెన్యూ అధికారులకు అందజేశారు.

విద్యావ్యవస్థలో మార్పులకు శ్రీకారం


కులకచర్ల: ముజాహిద్‌పూర్‌లో బడిబాటలో మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు

కులకచర్ల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థలో మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. బడిబాటలో భాగంగా సోమవారం ముజాహిద్‌పూర్‌లో ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సతీశ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుద్యాల: ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు రవీందర్‌గౌడ్, రాములు, అభయ్‌కుమార్, రవినాయక్, సాలిబాయి, మాధవి అన్నారు. బడిబాటలో భాగంగా సోమవారం దుద్యాల గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లప్ప, సుధాకర్‌రావు పాల్గొన్నారు.

వరిగి: బడిబాటలో భాగంగా సోమవారం మండల పరిధిలోని మిట్టకోడూరు గ్రామంలో ప్రధానోపాధ్యాయులు ఎండీ ఉస్మాన్‌అలీ ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఇంగ్లీష్ మీడియం బోధన ఉంటుందని, ఏడాదికి రెండు జతల దుస్తులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్స్‌నోట్‌బుక్స్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, మధుసూధన్‌రావు, కృష్ణయ్య, నర్సింహులు, సాధిక్, కవిత, చంద్రకళ పాల్గొన్నారు. అదేవిధంగా కాళ్ళాపూర్ గ్రామంలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం గంగాధర్, ఉపాధ్యాయులు సత్యానారాయణరెడ్డి, మధుసూధన్‌రెడ్డి, ఎమ్మార్సీ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై ప్రసవం

- సకాలంలో స్పందించిన ఆస్పత్రి వర్గాలు
- మెరుగైన వైద్యానికి హైదరాబాద్‌కు తరలింపు

వికారాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై ఓ మహిళ ప్రసవించిన ఘటన వికారాబాద్ పట్టణంలో వెలుగుచూసింది. పట్టణంలో యాచకురాలిగా జీవిస్తున్న మౌనిక గర్భవతి. ఆమెకు సోమవారం తెల్లవారుజామున 4గంటలకు పురుటినొప్పులు రావడంతో రైల్వేస్టేషన్ నుంచి వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి బయల్దేరింది. ఈ క్రమంలో ఆస్పత్రి ముందున్న హోటల్ సమీపంలో మగ బిడ్డకు జన్మనించింది. గమనించిన హోటల్ నిర్వాహకుడు ఆస్పత్రిలో సమాచారం ఇచ్చాడు. దీంతో ఆస్పత్రి వర్గాలు వచ్చి బిడ్డను, తల్లిని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ రాంచందర్‌రావు తెలిపారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి పీఏ ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈఘటనపై పూర్తి నివేదిక సమర్పించాలని మంత్రి ఆదేశించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో తెలిపారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ


మోమిన్‌పేట్‌లో యూనిఫాం పంపిణీ చేస్తున్న ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంఈవో మల్లేశ్

మోమిన్‌పేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో సోమవారం ఎంఈవో మల్లేశం, ప్రధానోపాధ్యాయులతో కలిసి ఎంపీడీవో విజయలక్ష్మి యూనిఫాంను పంపిణీ చేశారు. మండలంలోని 53 పాఠశాలల్లో బాలురు 1425, బాలికలు 1527 విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగేశ్వర్, రమేశ్, హన్మంత్‌రెడ్డి, మహిళా సమాఖ్య సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తాం

కులకచర్ల: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషిచేస్తామని కాంగ్రెస్ యూత్ మండల అధ్యక్షుడు జంగయ్య అన్నారు. మండలంలోని పీరంపల్లి పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్‌పర్సన్ శ్రీలత, ఉపాధ్యాయులు పార్వతీ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

వనమహోత్సవంలో భాగస్వాములు కావాలి


పరిగిలో మొక్క నాటుతున్న అధికారులు

పరిగి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): వనమహోత్సవంలో భాగస్వాములు కావాలని పరిగి ఏఎంసీ చైర్మన్ బి.పరశురాంరెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటయ్యలు అన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా సోమవారం పరిగి మున్సిపల్ పరిధిలోని పలుకాలనీల్లో వనమహోత్సవం కింద మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సిద్దాంతి పార్థసారథి, డీసీసీప్రధానకార్యదర్శి కె.హన్మంత్‌ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ, నాయకులు అక్బర్‌సేట్, తావుర్యా నాయక్, అయూబ్ పాల్గొన్నారు.

కార్మికులు జాగ్రత్తలు పాటించాలి


హెల్త్ క్యాంపులో కార్మికులు

వికారాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ అన్నారు. వికారాబాద్ మునిసిపల్ కార్యాలయంలో 100 రోజుల ప్రణాళికలో భాగంగా సోమవారం కార్మికులకు మున్సిపల్ కార్యాలయంలో హెల్త్‌క్యాంపు నిర్వహించారు. అదేవిధంగా తడిచెత్త, పొడిచెత్తపై అవగాహన, కుక్కకాటు నివారణ, ప్లాస్టిక్ నిషేదంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బాలికపై అఘాయిత్యానికి యత్నం?

తాండూరు రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): బాలికపై ఆటో డ్రైవర్ అఘాయిత్యానికి యత్నించిన ఘటన తాండూరు మండల పరిధిలో చోటు చేసుకుంది. కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక సోమవారం పదో తరగతి సప్లిమెంటరీ పరీక్ష రాసేందుకు తాండూరుకు వచ్చింది. తిరిగి ఆటోలో వెళ్తుండగా ఆటోడ్రైవర్ బాలికపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ అఘాయిత్యానికి యత్నించినట్లు బాలిక కుటుంబసభ్యులకు తెలిపింది. దీంతో కుటుంబీకులు కరన్‌కోట్ పోలీసుస్టేషన్‌కు వెళ్లి జరిగిన విషయాన్ని తెలిపినట్లు చెప్పారు. బాధిత కుటుంబీకులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని ఏఎస్ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


హరీష్‌కుమార్‌రెడ్డి

మూడుచింతలపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తూంకుంటకు చెందిన కంచిమిరెడ్డి హరీష్‌కుమార్‌రెడ్డి(32) తన భార్యతో తూంకుంటలో నివాసముంటూ కర్మపట్లలోని ఓ ఫార్మా కంపెనీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం పని ఉందని బయటకు వెళ్లొస్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిన హరీష్ కుమార్‌రెడ్డి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో చుట్టుపక్కల పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వస్తుండటంతో కుటుంబసభ్యులు శామీర్‌పేట్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. హరీశ్‌కుమార్‌రెడ్డి పచ్చ టీషర్ట్ జీన్స్ ధరించి ఉంటాడని, ఎవరైనా చూస్తే శామీర్‌పేట్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని 9490617142ను సంప్రదించాలని కోరారు.

నిలిపి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్

- యువకుడికి గాయాలు

పరిగి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన నిలిపి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి బైక్ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదం పరిగి మండలం సుల్తాన్ పూర్ గేటు సమీపంలో సోమవారం జరిగింది. బొంరాసిపేట్ మండలం మెట్లకుంటకు చెందిన వినోద్‌కుమార్(30), పరిగి నుంచి స్వగ్రామానికి వెళుతుండగా సుల్తాన్‌పూర్ గేటు దగ్గర నిలిచి ఉన్న ట్రాక్టర్‌కు వెనుకాల నుంచి ఢీకొట్టాడు. దీంతో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్సనిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

గురుకుల మహిళా డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

శామీర్‌పేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): శామీర్‌పేట(జగద్గిరిగుట్ట)లోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఇశ్రత్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థులు తమ పదోతరగతి, ఇంటర్మీడియట్ మార్కుల మెమోతో పాటు బదిలీ సర్టిఫికెట్(టీసీ), కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డుతోపాటు ఎనిమిది పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో ఈనెల 23లోపు కాలేజీకి వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కళాశాలలో బీఎస్సీ, బీకాం సంబంధిత కోర్సులు కొనసాగిస్తున్నట్లు వివరించారు. ఈ కళాశాల రాజీవ్ రహదారిలో శామీర్‌పేట విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్నట్లు ఆమె వివరించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బీజేపీ పోచారం మున్సిపాలిటీ అధ్యక్షుడిగా నానావత్ సురేశ్ నాయక్




ఘట్‌కేసర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పోచారం మున్సిపాలిటీ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. మున్సిపాలిటీ అధ్యక్షుడిగా నానావత్ సురేశ్ నాయక్, ఉపాధ్యక్షులుగా చంద్రికరెడ్డి, యాదగిరి కనకాచారీ, శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులుగా కె.మల్లేష్, సాయిరాజ్, వెంకటేష్, కార్యదర్శులుగా వంశీకుమార్, సరిత, మిశ్రా, రవిశంకర్, కోశాధికారిగా మల్లేష్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గిరిజన మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు బిక్కు నాయక్, నర్సింగరావు, మహేష్, రమేశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించండి


రాజాపూర్ గ్రామంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

పరిగి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించండి... ఫలితాలు సాధించి చూపిస్తామని పరిగి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు ఇంటింటి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం రాజాపూర్, మిట్టకోడూరు గ్రామాల్లో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు ఈ సారి జిల్లాలోనే పరిగి కళాశాల 74 శాతం ఉత్తీర్ణత సాధించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రాజ్‌కుమార్, రవి, ప్రభాకర్, గోపాల్, వరస్వామి, వెంకటేశ్, గణేశ్, బాలగణేశ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శి కుటుంబాన్ని ఆదుకోవాలి


సోనిబాయికి నివాళులర్పిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

మోమిన్‌పేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా పంచాయతీ కార్యదర్శుల గౌరవ అధ్యక్షుడు నర్సింహులు అన్నారు. ఖమ్మం జిల్లా రాంచంద్రాపూరం పంచాయతీ కార్యదర్శి బనోత్ సోనిబాయి విధినిర్వాహణలో భాగంగా పాల్గొని తిరిగి వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిందని వాపోయారు. మోమిన్‌పేట్ ఎంపీడీవో కార్యాలయం ముందు సోమవారం ఆమె చిత్రపటానికి మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో కలిసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రూ.50లక్షల పరిహారం, ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో యాదగిరి, ఏపీవో శంకరయ్య, జూనియర్ అసిస్టెంట్ హరీశ్, పంచాయతీ కార్యదర్శులు జగన్నాథ్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సమస్యలపై వినతి

చౌడాపూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ సోమవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో సోమలింగంకు వినతి పత్రం అందజేశారు. 16నెలల నుంచి ప్రభుత్వం ఎలాంటి నిధులు మంజూరు చేయకపోయినా గ్రామాల్లో పనులు చేయిస్తున్నట్లు వాపోయారు. ఇప్పటికైనా పంచాయతీ కార్యదర్శుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు.